అడిగేవారు లేక!

వినియోగదారులకు పెట్రోల్ బంకుల్లో వివిధ సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా.. ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. మంచినీరు, టాయిలెట్లు, వాహన టైర్లకు గాలి..అత్యవసర సమయాల్లో ఫోన్ వాడుకోవచ్చని చెబుతున్నా అధిక శాతం బంకుల నిర్వాహకులు మంచి నీరు ఇవ్వకపోగా.. బాత్ రూముల్లోకి కూడా రానివ్వడం లేదు. ఇక టైర్లకు గాలి తక్కువగా ఉందని చెబితే యంత్రం పనిచేయడం లేదని సాకులు చెబుతున్నారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో వినియోగదారులు ఏమీ చేయలేకపోతున్నారు.

- అధిక శాతం పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు అందని సౌకర్యాలు
- మంచినీరివ్వరు.. బాత్‌రూముల్లోకి రానివ్వరు!
- ఉచితంగా సౌకర్యాలు కల్పించాలని నిబంధనలు
- చివరకు టైర్లకు గాలి పట్టని వైనం
- వ్యాపారానికే ప్రాధాన్యతనిస్తున్న నిర్వాహకులు
- ఉదాసీనంగా అధికారులు

నంద్యాల(అర్బన్): పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు పలు రకాల సేవలు అందించాల్సి ఉంది. జిల్లాలో బీపీసీఎల్, ఐయూసీ, హెచ్‌పీసీఎల్, ఈఎస్ఎస్ఆర్, బీపీసీ, నయారా తదితర కంపెనీలకు చెందిన ప్రభుత్వ, పెట్రోల్ బంక్‌లు జిల్లాలో దాదాపు 148 వరకు ఉన్నాయి. ప్రభుత్వ పెట్రోల్ బంకులో వినియోగదారులకు అందాల్సిన సౌకర్యాలు అరకొరగానే అందుతుండగా ప్రైవేటు బంకుల నిర్వాహకులు మాత్రం నిబంధనల మేరకు సౌకర్యాలు చూపుతున్నా.. వినియోగదారులకు అందడం లేదు.

ధరలతో పాటు పెరుగుతున్న వ్యాట్..

పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. రేట్లు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతుంది. ప్రతి లీటర్‌పై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుముతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వీటి గురించి చాలామందికి తెలియదు. తెలిసిన ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలున్నాయి. పెట్రోలు బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు అందించకపోతే ఫిర్యాదు చేయొచ్చని చెబుతున్నా.. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోతుండటంతో వారి నిర్వాకాలు కొనసాగుతున్నాయి.



నంద్యాల ఎన్‌కే రోడ్డులో పనిచేయని గాలి మిషన్

తాగునీరు ఏర్పాటు చేయాలి..

పెట్రోలు బంకుల్లో స్వచ్ఛమైన తాగునీరు ఉండాలి. దీని కోసం బంక్ డీలర్ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ కలిగి ఉండాలి. ఏ బంకులోనైనా నీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు.

మరుగుదొడ్లు తప్పనిసరి..

స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల కోసం శుభ్రతతో కూడిన మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా నిర్వాహకులు వినియోగదారులను అనుమతించడం లేదు. మరికొన్ని చోట్ల అసలు అవి ఎక్కడున్నాయో కనిపించని పరిస్థితి. లీటరు పెట్రోలు లేదా డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంకులకు నాలుగు నుంచి ఎనిమిది పైసల వరకు మరుగుదొడ్లు, నిర్వహణకు చెల్లిస్తున్నామనే విషయం తెలిసిందే.

అత్యవసరమైతే ఫోన్ వాడుకోవచ్చు..

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కు కుంటే మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే ఏదైనా పెట్రోలు బంక్‌కు వెళ్లి ఏ నంబరుకైనా కాల్ చేసుకోవచ్చు. అయితే ఇదెక్కడా అమలు కావడం లేదు.

గాలి ఉచితం...

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. అయితే గాలి పెట్టాలని కోరితే యంత్రం పనిచేయడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు.

ప్రథమ చికిత్స కిట్ ఉంచాలి...

ప్రతి బంక్‌లో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్ అందుబాటులో ఉంచాలి. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్‌లో తప్పనిసరిగా ఉండాలి.



నంద్యాల విద్యుత్ కార్యాలయం ఎదురుగా సౌకర్యాలు ఏర్పాటు చేయని పెట్రోల్ బంక్

అవగాహన అవసరం



పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవలపై చాలామంది వాహనదారులకు అవగాహన లేదు. కొందరు బంకు నిర్వాహకులు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. యజమానులు, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలి
– హయగ్రీవాచారి, రాయపాడు

నిత్యం పరిశీలించాలి



పెట్రోల్ బంకులను సంబంధిత అధికారులు నిత్యం పరిశీలించాలి. అప్పుడే వారు అవకతవకలకు పాల్పడరు. వాహనదారులకు ఉచిత సౌకర్యాలను కల్పిస్తారు. – దూదేకుల కాశీం

క్లుప్తంగా

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కరాటేతో స్వీయ రక్షణ



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్వీయరక్షణ కోసం విద్యార్థులకు కరాటే శిక్షణ అవసరమని కరాటే సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ రామకృష్ణారెడ్డి, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ డైరెక్టర్ బాలకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి కరాటే పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నంద్యాల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, సిరిగిరి రమేష్, కరాటే మాస్టర్లు బాలకృష్ణ, నూర్‌బాషా పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల పంపిణీ



హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పద్మావతినగర్‌లో పీఏవీ గ్రూప్ స్టీల్ దుకాణంలో ఆదివారం నంద్యాల రెడీమేడ్ మర్చెంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పబ్బతి వేణుగోపాల్, అధ్యక్షుడు గద్వాల నరసింహరాజు ఆధ్వర్యంలో రెడీమేడ్ దుకాణాల యజమానులు, సిబ్బందికి హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాల సహకారంతో హెల్త్ కార్డులు అందిస్తున్నామన్నారు. ఉపాధ్యక్షులు వెంకటేష్, విజయ్‌కుమార్, మల్లి, శ్రీకృష్ణ, ప్రణీత, మోహన్ పాల్గొన్నారు.

మోక్షాన్ని ప్రసాదించే ఆకాశ దీపం



ఆలయంలో ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న మహిళ

నంద్యాల(వ్యవసాయం): శివకేశవులకు ఎంతో ప్రియమైన కార్తీక మాసంలో వెలిగించే ఆకాశ దీపం మోక్షాన్ని ప్రసాదిస్తుందని మల్లికార్జున స్వామి దేవస్థానం వేదపండితుడు సుబ్బయ్య శాస్త్రి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో ఉదయం పూట అభిషేకాలు, వ్రతాలు చేస్తూ సాయంత్రం దేవాలయ ఆవరణలోని ధ్వజ స్తంభానికి ఇత్తడి పాత్రలో నూనెపోసి వెలిగించి వేలాడదీస్తే ఆకాశ మార్గంలో వెళ్లే శివపార్వతులు అక్కడికి చేరుకొని ఆ ప్రాంతాన్ని రక్షించి, మోక్షాన్ని ప్రసాదిస్తారని కార్తీక పురాణం తెలియజేస్తుందన్నారు. కార్తీక మాసంలో శైవలయాల్లో దీపారాధనలు చేయడం వల్ల పుణ్యప్రాప్తి లభిస్తుందని వివరించారు.

బాలసదన్‌కు వాషింగ్ మిషన్ అందజేత



సీడీపీఓకి అందజేస్తున్న వాషింగ్ మిషన్

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని ప్రభుత్వ బాలసదన్ (చిల్డ్రన్ హోం)కు ఝాన్సీ క్రిష్ణ అనే బాలిక వాషింగ్ మిషన్ విరాళంగా అందజేసింది. ఆదివారం స్థానిక బాలసదన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరికి దాత అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అనాథ చిన్నారులు దుస్తులు శుభ్రం చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని.. ఇప్పుడు సమస్య తీరుతుందన్నారు. దాతను అభినందించారు.

మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలను చూపుతున్న ఎస్‌ఐ

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన సుబ్బయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ చెప్పారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. చట్టవ్యతిరేక పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రప్ప

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి 30 శాతం వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎంఆర్, పార్ట్ టైం, ఫుల్ టైం, కంటింజెంట్ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ వయస్సు దగ్గరకు వచ్చినా ఇంత వరకు సర్వీసు క్రమబద్ధీకరించలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు, సరెండర్ లీవ్, వైద్య విద్య ఖర్చుల అవసరాల నిమిత్తం పెట్టుకున్న ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు తక్షణమే మంజూరు చేయాలని, ఆరోగ్యశ్రీ పథకం రూ.5 లక్షలకు పెంచాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసులు, సిటీ అధ్యక్షులు సత్యం, మహిళా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

ఎస్‌టీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఎస్‌టీటీఎఫ్ (షెడ్యూల్, ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్) కార్యాలయంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు గోర్ల సుధాకర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ నియమించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కేశాలునాయక్, జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా రాము, వైస్ ప్రెసిడెంట్ దేవేంద్రుడు, రాంబాలాజీనాయక్, తిక్కస్వామి, విజయ్‌కుమార్, కోశాధికారి ప్రభాకర్, అడిషనల్ సెక్రటరీగా పక్కీరయ్య, సెక్రటరీగా రవీంద్రబాబు, నాగలక్ష్మి, శోభారాణి, రమేష్‌నాయక్, చంద్రమోహన్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.

పద్మశాలీయ సంఘం అధ్యక్షుడిగా వేణుగోపాల్



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడిగా గాజుల వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం స్థానిక భద్రావతి భావనారుషి కల్యాణమండపంలో మాజీ కౌన్సిలర్ భీమునిపల్లె సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నిక కార్యక్రమం అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా గాజుల ఎర్రయ్య, కోశాధికారిగా పాలాద్రి ఆనంద్, 9 మంది ఉపాధ్యక్షులు, 9మంది కార్యదర్శులు, కమిటీ మెంబర్లు ప్రమాణస్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. పుత్తా రామకృష్ణ, చెన్నా వెంకటేశ్వర్లు, ఊకొట్టు వాసు, శంకర్, సుబ్బయ్య పాల్గొన్నారు.

● పొంచి ఉన్న ప్రమాదం



తుడుమలదిన్నె–మాయలూరు మధ్య దెబ్బతిన్న కల్వర్టు

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు, గిద్దలూరు ఆర్‌అండ్‌బీ రహదారిలోని తుడుమలదిన్నె వద్ద కల్వర్టు శిథిలావస్థకు చేరి దెబ్బతింది. ఈ రహదారిలో ఆర్టీసీ బస్సులు ఆళ్లగడ్డ డిపో నుంచి తాడిపత్రికి రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే నిత్యం ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కల్వర్టుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డిని వివరణ కోరగా కల్వర్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

● కనుక్కోండి చూద్దాం..!



ముళ్లపొదల్లో ట్రాన్స్‌ఫార్మర్

దొర్నిపాడు: ఇక్కడ ముళ్లపొదల్లో ఒకటి దాగుంది కనుక్కోండి చుద్దాం అంటున్నారు గుండుపాపల గ్రామస్తులు. గ్రామానికి, మోటార్లకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ ఉమాపతినగరం దారిలో ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీగల ఆకులు అల్లుకుపోవడంతో అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడ ఉందో గుర్తుపట్టలేని పరిస్థితిలో ఉంది. ప్రస్తుతం ఏ సమస్య రాక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎవరూ పట్టించుకోలేదు. అవసర నిమిత్తం వెళ్లాల్సి వస్తే పరిస్థితి ఏంటీ? మాకెందుకు ఈ సమస్య? అని అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

● అడుగుకో గుంత..



గుంతలమయంగా గుండుపాపల–ఉమాపతినగరం రహదారి

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల–ఉమాపతినగరం రహదారి అధ్వానంగా ఉంది. అడుగుకో గుంత..గజానికో అతుకుగా మారింది. దీంతో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమాపతినగరంలో పక్షవాత నివారణ కేంద్రం ఉండడంతో రోగులు నిత్యం వస్తుంటారు. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో రోగులు అగచాట్లు పడుతున్నారు. రహదారిని ఆర్‌అండ్‌బీలోకి కలపాలని ప్రజాప్రతినిధులు, అధికారులను గ్రామస్తులు వేడుకుంటున్నారు. కనీసం ప్యాచింగ్‌లు వేసినా సరిపోతుందని వాపోతున్నారు.

విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 5వ తేదీన విజయవాడలో జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ద సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికీ సమాన విద్య అందాలని, సమ సమాజ స్థాపనకై ఉద్యమించాలన్నారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులతో భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు భగవత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగన్‌మోహన్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. దస్తగిరి, వెంకట్, చిన్న, మహేష్, శరత్, హరీఫ్ పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చని పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం



కరపత్రాలను విడుదల చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి లక్ష్యంగా హైందవ శంఖారావాన్ని జనవరి 5వ తేదీన విజయవాడలో లక్షలాది మందితో శక్తి ప్రదర్శన ఉద్యమం చేపట్టనున్నట్లు రాష్ట్ర కో కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా దేవాలయ పవిత్రతపై నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల దృష్ట్యా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు, చంద్రమౌళీశ్వరరెడ్డి, కిశోర్, అభిరుచి మధు, నీలకంఠం, కాశీబట్ల శివప్రసాద్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



బాషాను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న దేవనగర్ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బాషాను ఆదివారం ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శిల్పారవి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోటేష్ చిత్రానికి చిత్రకళా అవార్డు



కోటేష్ వేసిన దేవసుర చిత్రం



అవార్డు అందుకున్న కోటేష్

నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతల పల్లె కోటేష్ చిత్రకళా భారతి అవార్డు అందుకున్నారు. ఒంగోలులోని కళాయజ్ఞ సృష్టి ఆర్ట్ అకాడమీ ప్రాచీన భారత్ అనే అంశంపై ఇటీవల జాతీయ స్థాయి పెయింటింగ్, చిత్రకళా ప్రదర్శన పోటీలు నిర్వహించారు. వంద మంది చిత్రకారులు పాల్గొన్న పోటీల్లో కోటేష్ వేసిన దేవసుర చిత్రానికి ప్రతిష్టాత్మకమైన చిత్రకళా భారతి అవార్డు వచ్చింది. ఈ మేరకు ఆదివారం ఒంగోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసిద్ధ చిత్రకారులు శేషబ్రహ్మం, రవీంద్ర, ప్రముఖ రచయిత సుబ్బులు కోటేష్‌కు అవార్డు అందజేశారు. అవార్డు కింద రూ.10,116తో పాటు మొమెంటోతో సత్కరించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



శెట్టివీడులో పోటీలను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

చాగలమర్రి: శెట్టివీడు గ్రామంలోని మార్తోమా చర్చి 26వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మొత్తం 18 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు పాస్టర్ ప్రేమ్‌కుమార్, అభిన్ తెలిపారు. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7,500, మూడో బహుమతి రూ.5 వేలు చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు షేక్ చిన్న బికారి, రాముడు, నరసింహ పాల్గొన్నారు.

చాగలమర్రి నుంచి శబరిమలైకి పాదయాత్ర



కాలినడకన బయలుదేరుతున్న అయ్యప్ప భక్తులు

చాగలమర్రి: మండల కేంద్రానికి చెందిన గురుస్వామి వాసు, తెలంగాణకు చెందిన రమేష్ 100 మంది అయ్యప్ప భక్తులతో కలిసి ఆదివారం కాలినడకన శబరిమలైకి బయలుదేరారు. ముందుగా చాగలమర్రిలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 41 రోజుల పాటు కాలినడకన ప్రయాణం కొనసాగించి దీక్ష పూర్తయ్యే సమయానికి ఇరుముడితో శబరిమలై అయ్యప్పస్వామిని దర్శించుకోనున్నారు.

ప్రారంభమెప్పుడో..?



చిన్నవంగలిలో ప్రారంభానికి నోచుకోని ఆర్‌బీకే

చాగలమర్రి: గత జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు గ్రామ స్థాయిలో సుపరిపాలన అందించేందుకు ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో రైతు సమస్యల సత్వర పరిష్కారానికి, వారి సౌలభ్యం కోసం ఆర్‌బీకేలను నిర్మించింది. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో సుమారు రూ.40 లక్షలతో ఆర్‌బీకే నిర్మించారు. పూర్తయ్యే సమయానికి ప్రభుత్వం మారిపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన రైతులకు సక్రమంగా సేవలు అందడం లేదు. అధికారులు చొరవ తీసుకుని ప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు.

బైక్ చోరీ

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండలో బైక్ చోరీకి గురైంది. ఎస్‌ఐ వరప్రసాదు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన డేరంగుల మద్దిలేటి తన హెచ్‌ఎఫ్ డీలక్స్ ఏపీ 39బీఎఫ్ 7998 నంబర్ గల బైక్‌ను ఎప్పటి లాగే అక్టోబర్ 24వ తేదీ రాత్రి ఇంటి ప్రాంగణంలో ఉంచాడు. ఉదయం లేచి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

రుద్రవరం: వరిపైరుపై గడ్డి మందు పిచికారీ చేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాంభూపాల్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండల పరిధిలోని శ్రీరంగాపురానికి చెందిన సర్వుడు అనే రైతు రెండెకరాల పొలంలో వరి సాగు చేశాడు. నాలుగు రోజుల క్రితం ఆపైరుపై అదే గ్రామానికి చెందిన రమిజా, జమాల్ బాషా, హుసేన్‌బాషా గడ్డి మందు పిచికారీ చేయడంతో పైరు దెబ్బతిందని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు.